

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 4 మార్చి 2025 | 5







కనులవిందు

ప్రకృతి అంటేనే అందం. దానికి అదనపు ఆకర్షణ మంచు తెరలు. కోనసీమ అందానికి నిలువెత్తు దర్పణం ఇది. సోమవారం ఉదయం ఆరు గంటలకు మండపేట పట్టణ శివారున పంట పొలాల్లో కనిపించిన పొగ మంచు దృశ్యాలివి..

- మండపేట



బుకీలు.. బుక్కయ్యారు!

7

- ఇండియా-న్యూజిలాండ్ మ్యాచ్‌పై బెట్టింగ్ నిర్వహించిన ఆరుగురి అరెస్ట్
- 4 ల్యాప్‌టాప్‌లు, 50ఫోన్లు స్వాధీనం
- రూ.7.38 లక్షల నగదు ఖాతా ఫ్రీజ్

బ్యాలెట్.. బాక్సింగ్!



ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలో ఓట్ల లెక్కింపు

ఉదయం నుంచి ఎమ్మెల్సీ ఓట్లతో కుస్తీ

- సుదీర్ఘంగా బ్యాలెట్ ఓట్ల లెక్కింపు
- కట్టలుగా కట్టేందుకే 12 గంటలు
- 700 మంది సిబ్బంది నియామకం
- మూడు షిఫ్టులుగా విధులు
- రాత్రి 8 నుంచి లెక్కింపు ఆరంభం
- 10 గంటలకు తొలిరౌండ్ పూర్తి
- ఫలితానికి మరింత సమయం
- ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ

(ఏలూరు - ఆంధ్రజ్యోతి)

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు టెన్షన్.. టెన్షన్‌గా సాగుతోంది. సోమవారం రాత్రి 8 గంటలకు ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో ప్రారంభమైన ప్రక్రియ తొలి రౌండ్ ఫలితం రాత్రి పదిన్నరకు వెల్లడైంది. ఫిబ్రవరి 27న జరిగిన పోలింగ్‌లో మొత్తం 35 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. రెండు లక్షల 18 వేల 902 ఓట్లు పోలయ్యాయి. ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో కౌంటింగ్‌కు గాను 28 టేబుల్స్ వినియోగించి 17 రౌండ్లలో పూర్తిచేయాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ సోమవారం ఉదయం ఆరంభమై రాత్రి పొద్దు పోయేంత వరకు నిరవధికంగా కొనసాగుతోంది. ఓట్ల లెక్కింపునకు వీలుగా ఉదయం ఎనిమిది గంటల నుంచే సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా తొలుత స్ట్రాంగ్ రూముల నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రానికి చేర్చారు. సాధ్యమైనంత మేర కౌంటింగ్ ప్రక్రియలో జాప్యం నివారించేందుకు ప్రయత్నిస్తున్నా పొద్దు పోయేంత వరకు బ్యాలెట్ పత్రాలు బండిల్స్‌గా కట్టేందుకు ఎక్కువ సమయం తీసుకుంది. 17 రౌండ్ల వారీగా బ్యాలెట్ బాక్సుల్లోని పత్రాలను బయటకు తీసి తొలుత కట్టలుగా కట్టారు. ఈ ప్రక్రియ నిరవధికంగా కొనసాగేందుకు వీలుగా 28 టేబుళ్లలో 17 రౌండ్ల మేర కొనసాగించేందుకు ఏర్పాట్లుచేసి మూడు షిఫ్టుల్లో 700 మంది సిబ్బంది, అధికారులను రంగంలోకి దించారు.

లెక్కింపు..ఈజీ కాదు..

సాధారణంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు అంత సులువుగా సాగదు. ఈసారి అదే పరిస్థితి ఆవిష్కృతమైంది. ఉదయం నుంచే సిబ్బందిని కౌంటింగ్ కేంద్రాల్లో మోహరించి వారికి బ్యాలెట్ బాక్సులు తెరవడం, వాటిలో ఉన్న బ్యాలెట్ పత్రాలను బండిల్స్‌గా కట్టడం వంటి ప్రక్రియను అప్పగించారు. తొలి మూడు గంటల్లో పోస్టల్ బ్యాలెట్లను పరిశీలించారు. మొత్తం పోస్టల్ బ్యాలెట్‌లు 242 కాగా వీటిలో 201 బ్యాలెట్ పత్రాలు చెల్లుబాటు కాగా మరో 41 చెల్లకుండా పోయాయి. ఉదయం 11 గంటల నాటికే పోస్టల్ బ్యాలెట్‌ల తతంగాన్ని ముగించారు. సమాంతరంగా రౌండ్‌ల వారీగా బ్యాలెట్ పత్రాలు బండిళ్లుగా కట్టలు కట్టే పనిని కొనసాగిస్తూ వచ్చారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, మిగతా అధికారులు కౌంటింగ్ ప్రక్రియ ఆరంభం నుంచి క్షణక్షణం పరిశీలించడంలో నిమగ్నమయ్యారు. కౌంటింగ్ కేంద్రంలో గుర్తింపుకార్డులున్న వారినే అనుమతించారు. మీడియాను నిర్దేశించిన ప్రాంతంలోనే ఉంచారు. మధ్యాహ్నం నుంచి కొందరిని అనుమతించారు.



లెక్కింపు కేంద్రం వద్ద కూటమి అభ్యర్థి పేరాబత్తుల

బండిల్స్‌గా కట్టేందుకే ఒకరోజు..

సాధారణ ఎన్నికలకు భిన్నంగా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలను వినియోగించారు. ఈకారణంగా బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రంలోకి రప్పించడం, వాటి నుంచి బ్యాలెట్ పత్రాలను వెలికి తీసి బండిళ్లుగా కట్టడానికి చాలా సమయం తీసుకుంది. రౌండ్‌ల వారీగా పదివేలకు తగ్గకుండా ఈ బండిళ్లను ఏర్పాటు చేస్తూ వచ్చారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల్లోపు సుమారు పది వేల ఓట్లతో మొదటి రౌండ్ బండిళ్లుగా కట్టగలిగారు. అప్పటి నుంచి 11వ రౌండ్ వచ్చే సరికి బ్యాలెట్ పత్రాలను కట్టలుగా కట్టేందుకు ఏడు గంటల సమయం తీసుకుంది. వాస్తవానికి కౌంటింగ్ కేంద్రంలో రౌండ్‌ల సంఖ్య, టేబుల్స్ సంఖ్య కాస్త పెంచి ఉంటే ఇంత సుదీర్ఘ సమయం పట్టేది కాదు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు లోబడి అతి తక్కువ టేబుళ్లను వేసి కౌంటింగ్‌కు దిగారు. ఒకవైపు బ్యాలెట్ పత్రాలను బండిళ్లుగా చేసేందుకు సమయం పడుతుండడంతో అభ్యర్థులతోపాటు ఎన్నికల ఫలితాలపై ఎదురు చూస్తున్న వారంతా ఉత్కంఠకు గురయ్యారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్‌లో తొలి ప్రక్రియ మాత్రమే రాత్రి వరకు కొనసాగుతూ వచ్చింది. రాత్రి ఎనిమిది గంటల సమయానికి బండిళ్లుగా కట్టడం పూర్తయ్యింది. ఈ మొత్తం ప్రక్రియకు మొత్తం 12 గంటల సమయం పట్టింది. రాత్రి 8 గంటల ప్రాంతంలో తొలి రౌండ్ ఓట్ల లెక్కింపు ఆరంభించారు. ప్రచారంలో నువ్వానేనా అన్నట్టుగా సాగిన వ్యవహారం ఓట్ల లెక్కింపు లోను అదే ఉత్కంఠ కొనసాగుతోంది.

తొలి రౌండ్ పేరాబత్తులదే..


ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు టెన్షన్.. టెన్షన్‌గా సాగుతుంది. ఎనిమిది రౌండ్‌లుగా ఒక్కో రౌండ్‌కి 28 వేలు చొప్పున లెక్కించేందుకు రంగంలోకి దిగారు. ఒక్కో రౌండ్‌లోను చెల్లినవి, చెల్లని ఓట్లు విడివిడిగా విభజిస్తారు. సోమవారం రాత్రి 8 గంటలకు ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో ప్రారంభమైన ఈ ప్రక్రియ తొలి రౌండ్ ఫలితం రాత్రి పదిన్నరకు వెల్లడైంది.కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి 16,520 ఓట్లు, సమీప పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల రాఘవులుకు 5,815 వేల ఓట్లు, ఇతరులకు 3249 లభించాయి. 2416 చెల్లని ఓట్లు ఉన్నాయి.ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి మంగళవారం రాత్రి పొద్దుపోవచ్చని అంచనా వేస్తున్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

ఏలూరు క్రైం : ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్ కేంద్రమైన సర్ సీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద ఎస్పీ కేపీఎస్ కిశోర్ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసి స్వయంగా పరిశీలించారు. సోమవారం వేకువజామునే కౌంటింగ్ విధులకు నియమించ బడిన ఉద్యోగులు, ఏజెంట్లను పోలీస్ సిబ్బంది మెటల్ డిటెక్టర్లతో, బ్రీత్ ఎనలైజర్లతో తనిఖీలు చేశారు.సెల్‌ఫోన్‌లు బయట కౌంటర్‌లోనే ఉంచేలా చర్యలు తీసుకున్నారు. బందోబస్తులో ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్, పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు, నూజివీడు డీఎస్పీ ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, డీఎస్పీ యుగంధర్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్.కిశోర్



మెరుగైన జీవనం దిశగా..

- ఆర్థికంగానూ, సామాజికంగానూ ముందుకే
- జిల్లా బ్యాంకుల్లో ప్రజల డబ్బు రూ.11,031 కోట్లు
- అప్పుల రూపంలో బ్యాంకుల నుంచి పొందింది రెట్టింపు
- సామాజిక, ఆర్థిక సర్వేలో కోనసీమకు స్పష్టమైన ప్రగతి

(అమలాపురం -ఆంధ్రజ్యోతి)

డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మొత్తం 290 అన్ని రకాల బ్యాంకుల బ్రాంచిల్లో ప్రజలు దాచుకున్న డబ్బు రూ.11,031.24 కోట్లుగా రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన 2024-2025 సోషియో ఎకనామిక్ సర్వేలో వెల్లడించింది. అటు ఈ బ్యాంకులు ప్రజలకు అప్పులరూపంలో ఇచ్చిన మొత్తం రూ.23, 514.35 కోట్లుగా ఉన్నట్టు పేర్కొంది. ఇక ఎన్టీఆర్ వైద్య సేవ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో పేద రోగులకు చికిత్స కోసం ప్రభుత్వం రూ.546.21 కోట్లు చెల్లించినట్టు నివేదిక వివరించింది. రాష్ట్రప్రభుత్వం సోమవారం సోషియో ఎకనామిక్ సర్వే పేరుతో 465 పేజీల నివేదిక వెల్లడించింది. ఇందులో రాష్ట్రం ఏయే రంగాల్లో ప్రగతి దిశగా కదులుతోంది.. ఆయా రంగాల్లో ప్రగతి ఎలా ఉంది.. జిల్లాల వారీగా వ్యవసాయ, ఉద్యాన, పారిశ్రామిక, ప్రజల ఆర్థిక స్థితిగతులు వంటి అనేక కీలక అంశాలకు సంబంధించి కూలంకుష నివేదిక విడుదల చేసింది. ఇందులో 2024 ఏప్రిల్ నుంచి 2025 డిసెంబర్ వరకు ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాల వారీగా ఆయా సామాజిక, ఆర్థిక స్థితిగతులను గణాంకాల రూపంలో విశ్లేషించింది. వాస్తవానికి ప్రభుత్వం ప్రతి ఏటా మాదిరిగానే నిర్వహించిన సామాజిక ఆర్థిక సర్వేను తీసుకువచ్చింది. 2024-25 బడ్జెట్ పత్రాలతోపాటు శాసనసభ, మండలి ఉభయసభల్లో సామాజిక ఆర్థిక సర్వేకు సంబంధించి సమగ్ర నివేదికల్లో అధికారిక డేటాను వివరించింది. ప్రభుత్వ విభాగాల మధ్య సహకార ప్రయత్నాలు, వృద్ధి, విజయాలను ఈ సర్వేలో స్పష్టంచేసింది. దీనిలో భాగంగా ఇతర రాష్ట్రాలతో పోటీపడే దిశగా దీర్ఘకాలిక లక్ష్యాలు, సుస్థిర లక్ష్యాలతోపాటు సామాజిక వృద్ధిపై ప్రభావం చూపే స్వర్ణాంధ్ర విజన్-2047పై సమగ్ర నివేదికను ప్రస్తావించింది. దీనిలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొన్ని అంశాలను ఆ డాక్యుమెంట్‌లో ప్రభుత్వం ప్రస్తావించింది. గోదావరి జోన్‌లో భాగంగా కోకో ఉత్పత్తికి సంబంధించిన అంశంలో కోనసీమ ప్రగతిని వివరించింది. ఆక్వా, వరి, కొబ్బరి తదితర పంటల విషయంలో ఏమేరకు వృద్ధి సాధించిందీ వివరించింది. పౌరసరఫరాలశాఖకు సంబంధించి అంత్యోదయ కార్డులు 24,501, పేదల కార్డులు 5,23,225 ఉండగా మొత్తం 5,47,726 ఉన్నాయి. వీరికి నెలకు 8,321 మెట్రిక్ టన్నుల బియ్యం అందజేస్తున్నారు. అలాగే దీపం-2 పథకం కింద లబ్ధిదారులు 3,36,184 మంది ఉండగా, వారికి రూ.27 కోట్లు ఇప్పటివరకు సబ్సిడీ రూపంలో అందజేశారు. అలాగే జిల్లాలో దీపం పథకం కింద 1,60,638 ఎల్‌పీజీ సిలెండర్లు, ట్రైబల్ ప్యాక్ 7, సీఎస్ఆర్ 4,579, పీఎంయూవై కింద 24,114, ఇతర కనెక్షన్లు 2,27,859తో కలిపి మొత్తం కనెక్షన్లు 4,17,197 ఉన్నాయి. ఇక జిల్లాలో షార్ట్ టర్మ్ ప్రొడక్షన్ కింద రుణాలు రూ.3,346 కోట్లు, టర్మ్ లోన్లు కింద రూ.3,261 కోట్లు మొత్తం అందించారు. అలాగే పాల ఉత్పత్తులు జిల్లాలో 278.597 మెట్రిక్ టన్నులు, మాంసం 19.663 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతోంది. అలాగే కోడిగుడ్ల ఉత్పత్తిలోనూ గణనీయమైన ప్రగతి సాధించింది. పశుసంపద పరంగా గేదెలు 75,460, ఆవులు 1,53,542, గొర్రెలు 25,111, మేకలు 23,518, కోళ్లు 57,31,807 ఉన్నాయని సర్వే గణాంకాలు చెబుతున్నాయి.



తెగ తవ్వేస్తున్నారు..



కేదార్లంక ఇసుక రీచ్‌లో యంత్రాలతో ఇసుకను పోగు చేస్తున్న దృశ్యం.. ట్రాక్టర్‌లో తరలిస్తూ..



- కేదార్లంక ఇసుక రీచ్‌లో ఇసుక అక్రమ తవ్వకాలు
- దళారులదే ఇష్టారాజ్యం
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసులు

కొత్తపేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానాన్ని కొందరు అక్రమార్కులు తమ ఆధీనంలోకి తెచ్చుకుని ఇసుక తవ్వకాలు చేస్తూ లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారు. ఆయా రీచ్‌ల్లో దళారీలుగా వ్యవహరిస్తూ తమకు ఇష్టం వచ్చిన రేట్లను వసూలు చేస్తూ పేద, మధ్యతరగతి గృహనిర్మాణదారులను దోచుకుంటున్నారు. ముఖ్యంగా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక ఇసుక రీచ్‌లో ఈ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్న సంబంధిత పోలీస్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కేదార్లంక ఇసుక రీచ్‌లో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని గుర్తించిన మైన్స్ అధికారులు 8 ట్రాక్టర్లను సీజ్ చేసినప్పటికీ ఆ తర్వాత రోజు నుంచే మళ్లీ అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయంటే దళారీలు సంబంధిత అధికారులను ప్రసన్నం చేసుకుని అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోకుండా కేదార్లంక ఇసుక రీచ్‌లో నదీ గర్భానికి దగ్గర్లో బాటలు వేసి యంత్రాలతో ఇసుకను తవ్వేస్తున్నారు. దానికి ఒక చోటకు చేర్చి కూలీలతో ట్రాక్టర్లతో లోడు చేయిస్తున్నారు. ఉచిత ఇసుక మాటున ఈ అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. దళారీలు ఇష్టారాజ్యంగా డిమాండ్‌నుబట్టి ధరను నిర్ణయిస్తున్నారు. ట్రాక్టర్‌కు రూ.1000 చొప్పున వసూలు చేస్తూ ఆపై అధిక లోడుకు మరో రూ.100 వసూలు చేస్తున్నా పట్టించుకునేవారే లేరు. ఇసుక రీచ్ కేదార్లంకలో ఉన్నా రవాణా అంతా కొత్తపేట మీదుగా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా, అక్రమాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు చెప్పడం కొసమెరుపు.

అక్రమ ఇసుక తరలింపును నిరోధించాలి : కలెక్టర్

అమలాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమ ఇసుక తరలింపును పూర్తిగా నిరోధించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో భవన, రోడ్ల నిర్మాణ రంగాల డిమాండ్‌కు అనుగుణంగా ఇసుకను సరఫరా చేస్తూ స్టాక్ పాయింట్లలో వర్షాకాలంలో అవసరమైన 25 లక్షల టన్నుల ఇసుకను నిల్వచేయాలని ఆదేశించారు. అనధికారికంగా గోదావరిలో ఇసుక తవ్వకాలు చేపట్టి అక్రమంగా తరలిస్తున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలన్నారు. సెమీ మెకనైజ్డ్ రీచ్‌లలో వారం రోజుల్లో ఇసుక తవ్వకాలు ప్రారంభించాలన్నారు. ఇసుక తవ్వకాల కోసం ఐదు రీచ్‌లను ప్రతిపాదించి ప్రజాభిప్రాయాన్ని సేకరించామన్నారు. ఆయా రీచ్‌లకు పర్యావరణ అనుమతుల కోసం కాలుష్య నియంత్రణ మండలి జిల్లాస్థాయి అధికారి కృషి చేయాలన్నారు. విశాఖపట్నం జిల్లా యంత్రాంగం అభ్యర్థన మేరకు పొడగట్లపల్లి ఇసుక రీచ్‌ను వారికి కేటాయించామన్నారు. సమావేశంలో జిల్లా భూగర్భ గనులశాఖ అధికారి ఎల్.వంశీరెడ్డి, జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాసరావు, కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజనీర్ శంకరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ కృష్ణారెడ్డి, డీపీవో డి.శాంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

వేసవిలో తాగునీటి ఎద్దడి ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలి : కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుత వేసవి సీజన్‌లో తాగునీటి ఎద్దడి సమస్యలు ఉత్పన్నం కాకుండా లైన్ డిపార్టుమెంట్ అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం గ్రామీణ నీటి సరఫరా ఇంజనీర్లు, మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. సీపీడబ్ల్యుఎస్ స్కీముల పనితీరు, గోదావరి తీరంలో పరీవాహక నీటి ద్వారా తాగునీటి ఏర్పాట్లు, బోరుబావుల మరమ్మతులు, వేసవి స్టోరేజ్ ట్యాంకులు నింపడం తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అనుమతులు పొందుతూ పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించాలన్నారు. నీటి ఎద్దడి ఉన్నచోట ట్యాంకర్ల ద్వారా ఓఎన్జీసీ సీఎస్సార్ ఆర్థిక సహాయంలో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వేసవి స్టోరేజ్ చెరువుల ద్వారా నీటి చౌర్యానికి పాల్పడుతున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 26 సామాజిక రక్షిత తాగునీటి పథకాలు, 17 పరీవాహక నీటి సరఫరా పథకాలు, మూడు బోర్ వెల్స్ ఉన్నాయన్నారు. అవసరమైతే వీటి సామర్థ్యాలను పెంచాల్సిన ఆవశ్యకతను ఇంజనీర్లు గుర్తించి ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. కాల్వలను మూసివేసే నాటికి 43 వేసవి స్టోరేజ్ చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని ఆదేశించారు. తాగునీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా సంబంధిత ఇంజనీర్లు పూర్తి బాధ్యత వహించాలన్నారు. పక్షం రోజులకు ఒకసారి విధిగా ఓవర్‌హెడ్ ట్యాంకులను క్లీనింగ్ చేయడం, నీటి శుద్ధి నాణ్యత పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ కెమికల్ పారామీటర్లు, బయోలాజికల్ పారామీటర్లను లాబ్‌ల సహకారంతో నీటి నాణ్యతను పరిశీలించాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎక్కడా లీకేజీలు లేకుండా పైపులైను వ్యవస్థను పటిష్టంగా నిర్వహించాలన్నారు. వేసవి దృష్ట్యా నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథా చేయరాదనిసూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు కేవీఆర్ఆర్ రాజు, పీవీ రంగారావు, రవివర్మ, ఆర్‌డబ్ల్యు ఎస్ ఇంజనీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

అమలాపురం టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు జిల్లాలో సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. ద్వితీయ సంవత్సరం జనరల్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు తెలుగు, హిందీ, సంస్కృతం పరీక్షలు, ఒకేషనల్ విద్యార్థులకు జనరల్ ఫౌండేషన్ కోర్సు పరీక్షలు జరిగాయి. జనరల్ ఇంటర్ విద్యార్థులు 10,028 మందికిగాను 9,705 మంది హాజరు కాగా 323 మంది గైర్హాజరయ్యారన్నారు. 2,348 మంది ఒకేషనల్ విద్యార్థులకు 2197 మంది హాజరుకాగా 151 మంది గైర్హాజరైనట్టు విద్యాశాఖాధికారి తెలిపారు.




వన దేవత అమ్మవారిని సీలేరు నదిలో పడవలో నుంచి... అనంతరం పొల్లూరు జలపాతం వద్దకు ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం



అమ్మవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్, అడిషనల్ ఎస్పీ పంకజ్‌కుమార్‌మీనా

గిరిజన జాతర

మోతుగూడెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలోని పొల్లూరు గ్రామంలో సోమవారం జరిగిన మన్యంకొండ జాతరకు ఒడిశా, ఆంధ్ర భక్తులు పోటెత్తారు. ముందుగా ఒడిశా సరిహద్దు నుంచి మన్యంకొండ దేవతను సీలేరు నదిలో ప్రత్యేక కొత్త పడవపై పొల్లూరు తీసుకొచ్చారు. అక్కడ చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్, అడిషనల్ ఎస్పీ పంకజ్‌కుమార్‌మీనా, ఏపీ జెన్‌కో లోయర్ సీలేరు ప్లాంట్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ కొబ్బరికాయలు కొట్టి అమ్మవారిని ఆహ్వానించారు. అనంతరం పొల్లూరు మైదానంలో మిద్దెలను ఏర్పాటు చేసి అమ్మవారిని కూర్చోబెట్టారు. అక్కడ పొల్లూరు అర్చకుడు అయినవిల్లి కుమారస్వామి ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో, అడిషనల్ ఎస్పీ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. నానావిధ పరిమళ పుష్పాలు, ధూప, దీప నైవేద్యాలతో పూజారి కుమారస్వామి శర్మ పూజలు చేశారు. అనంతరం వేలాది మంది గిరిజనులు నృత్యాలు, మేళతాళాలతో వన దేవతను పొల్లూరు జలపాతం వద్దకు తీసుకువెళ్లారు. అక్కడ ఒడిశా నుంచి వచ్చిన పూజారులు వారి విధానంలో పూజలు జరిపారు. జలపాతం నీటి దగ్గరకు వచ్చి నైవేద్యం సమర్పించగానే బంగారు చేప దర్శనమిచ్చింది. ఒడిశా ప్రజలంతా ఒక్కసారిగా అమ్మవారి నామస్మరణ చేస్తూ బంగారు చేపకు నమస్కరించుకున్నారు. జలపాతం వద్ద పూజారుల స్నానం అయ్యాక అమ్మవారి ఘటాలను నీటిలో ముంచి తీశారు. తర్వాత భక్తులంతా జలపాతంలో స్నానాలు చేశారు. జలపాతం వద్ద నుంచి అమ్మవారిని సీలేరు నది దాటించి ఒడిశాకు తీసుకెళ్లారు. దీంతో ఆంధ్రాలో మన్యంకొండ జాతర పూర్తయింది.

అంబరాన్నంటిన మన్యంకొండ జాతర

పొల్లూరు జలపాతం వద్దకు పోటెత్తిన ఒడిశా, ఆంధ్ర భక్తులు

బంగారు చేప దర్శనంతో తన్మయత్వం



బంగారు చేపకు ప్రసాదం సమర్పిస్తున్న పూజారులు



జాతరకు వచ్చిన నవరంగపూర్ ఎంపీ బలబద్రి మజ్జి, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడకామీ

ఏర్పాట్లు భేష్...

మన్యంకొండ జాతరలో పాల్గొనేందుకు ఒడిశా రాష్ట్రం నవరంగపూర్ ఎంపీ బలబద్రి మజ్జి, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడకామీ సోమవారం ఫ్లోటింగ్ బ్రిడ్జి దాటి పొల్లూరు చేరుకున్నారు. వారికి ఎంపీడీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి జి.మోహన్ కండువాలు కప్పి ఆహ్వానించారు. అక్కడి నుంచి నేరుగా పొల్లూరు జలపాతం వద్దకు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ మన్యంకొండ జాతరకు వచ్చే రెండు రాష్ట్రాల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆంధ్ర అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. చింతూరు మండల అధికారులు సీలేరు నది వద్ద వైద్య శిబిరాలు, తాగునీటి సౌకర్యం, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో జాతర ప్రశాంతంగా జరిగిందన్నారు. చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్, అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్‌మీనా, మల్కన్‌గిరి ఐటీడీఏ పీవో దుర్యోధన బోయ్, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ప్లాంట్ మేనేజర్ బాలకృష్ణ, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, చింతూరు సీఐ తెల్లం దుర్గాప్రసాద్, మోతుగూడెం ఎస్ఐ శివనారాయణ, డొంకరాయి ఎస్ఐ శివకుమార్, గంగవరం ఎస్ఐ వెంకటేశ్వర రావు, చింతూరు తహసీల్దారు శ్రీనివాసరావు జాతరను పర్యవేక్షించారు. జాతరకు దాదాపు 40వేల మంది భక్తులు హాజరుకాగా వారికి భోజన ఏర్పాట్లు చేశారు. అన్నపూర్ణ ట్రస్టు నిర్వాహకులు, స్థానిక యువకులు, వ్యాపారస్తులు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు, మంచినీళ్ల పంపిణీ చేశారు.



మన్యంకొండ జాతరను తిలకించేందుకు వచ్చిన భక్తులు

బాలయోగి ఆశయ సాధనకు కృషి

» త్వరితగతిన కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ నిర్మాణం » కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

అమలాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కోనసీమ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేసిన లోక్‌సభ దివంగత స్పీకర్ సేవలు మరువలేనివని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని జీఎంసీ బాలయోగి ఘాట్‌లో సోమవారం జరిగిన బాలయోగి 23వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అందరితోనూ ఆప్యాయంగా ఉండే ఆయన హెలికాప్టర్ ప్రమాదంలో అకాల మృత్యువు చెందడం దురదృష్టకరమన్నారు. తొలుత మంత్రి అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌తో కలిసి బాలయోగి విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. బాలయోగి ఆశయాల్లో అత్యంత ప్రధానమైన కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి రైళ్లను నడిపేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. తన తండ్రి ఆశయ సాధనకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హరీష్‌మాధుర్ హామీ ఇచ్చారు. బాలయోగి ఘాట్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చిల్లా జగదీశ్వరి, మానేపల్లి అయ్యాజీ వేమా, ఆల్డా చైర్మన్ యాళ్ల దొరబాబు, కూటమి నేతలు పెచ్చెట్టి విజయలక్ష్మి, ఆకుల రామకృష్ణ, నాగిడి నాగేశ్వరరావు, నల్లా పవన్‌కుమార్, శిరిగినీడి వెంకటేశ్వరరావు, దెందుకూరి సత్తిబాబురాజు, కేతా శ్రీనివాస్, అడబాల సత్యనారాయణ, చింతం కృష్ణ, మోకా వెంకటసుబ్బారావు, పెచ్చెట్టి చంద్రమౌళి, ఆర్వీ నాయుడు, మద్దింశెట్టి సూరిబాబు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బాలయోగి ఘాట్‌లో నివాళులర్పించారు. అంతకు ముందు బాలయోగి తనయుడు హరీష్‌మాధుర్ తన గృహంలో శాస్త్రోక్తంగా పూజలు జరిపి నివాళులర్పించారు. ఇటీవల మరణించిన టీడీపీ కోరింగ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంటపల్లి చంద్రమౌళి కుటుంబానికి బాలయోగి జ్ఞాపకార్థం రూ.లక్ష చెక్కును కేంద్ర మంత్రి, ఎంపీ అందజేశారు.



బాలయోగి ఘాట్‌లో నివాళులర్పిస్తున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, ఎంపీ హరీష్‌మాధుర్



పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ సుజాత

మహిళా ఉద్యోగులకు సాంస్కృతిక, ఆటల పోటీలు

కాకినాడ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులకు సాంస్కృతిక, ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ బి.సుజాత పేర్కొన్నారు. పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం కలెక్టర్ షాన్ మోహన్ ఆవిష్కరించారు. 5న జరిగే క్రీడా పోటీల ప్రారంభోత్సవ సభకు కలెక్టర్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి కాకినాడ ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్‌లోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌లో క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి వై.పద్మ మీనాక్షి, సహ అధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.జయలక్ష్మి, కన్వీనర్ దేవి, కాకినాడ టౌన్ అధ్యక్ష, కార్యదర్శులు అరదాడి సత్తిరాజు, వై.రామకృష్ణ, మహిళా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'నన్నయ'లో నారీఫెస్ట్

దివాన్‌చెరువు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నారీఫెస్ట్ నిర్వహిస్తున్నట్టు ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ సోమవారం తెలిపారు. తొలిరోజైన మంగళవారం మామ్మ (అమ్మమ్మ, నానమ్మ) -మనవరాలు ఫ్యాషన్‌షో, హెల్దీ బేబీ పోటీలు జరుగుతాయన్నారు. హెల్దీ బేబీ షోలో పాల్గొనేందుకు ఐదేళ్లలోపు బాలబాలికలు అర్హులన్నారు. స్థానిక మహిళలందరూ ఈ పోటీల్లో పాల్గొనాలని వీసీ కోరారు. హెల్దీ బేబీ పోటీలకు 63057 89433, మామ్మ-మనవరాలు పోటీలకు 99126 62500 నెంబర్లను సంప్రదించాలన్నారు. గురువారం వర్శిటీలో నన్నయ యూనివర్శిటీ, అనుబంధ కళాశాలల మహిళా సిబ్బందికి వివిధ పోటీలు, 6న అంతర్జాతీయ మహిళాదినోత్సవం నిర్వహిస్తామని చెప్పారు.

సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1.88 కోట్లు

అన్నవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవీ రోహిత్ పర్యవేక్షణలో సోమవారం లెక్కించారు. రూ.1,88,91,940 నగదు, 66 గ్రాముల బంగారం, 693 గ్రాముల వెండి సమకూరాయి. 129 యూఎస్‌ఏ డాలర్లు, 530 యూఏఈ దిరహమ్స్, సెంట్రల్ బ్యాంక్ 100 ఒమెన్, 50 సింగపూర్ డాలర్లు లభించాయి. 31 రోజులకు ఈ ఆదాయం లభించిందని ఈవో సుబ్బారావు చెప్పారు.



లైంగిక వేధింపులకు పాల్పడిన హెచ్‌ఎంపై పోక్సో కేసు

కరప, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొర్రిపూడి హైస్కూల్ హెచ్‌ఎం కాశీవిశ్వేశ్వరరావు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు విద్యార్థినులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కాకినాడ జిల్లా ఉపవిద్యాశాఖాధికారి ఎస్.వెంకటేశ్వరరావు విచారణ చేపట్టారు. ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణి, ఎంఈవో-2 పత్తి సత్యనారాయణలతో కలిసి స్థానిక పాఠశాలను సందర్శించారు. బాధిత విద్యార్థినులను రహస్యంగా విచారించి వివరాలను నమోదు చేశారు. 78మంది విద్యార్థినులను విచారించగా వారిలో 20మంది హెచ్‌ఎంకు వ్యతిరేకంగా రిపోర్టు ఇచ్చినట్టు తెలిసింది. విచారణ నివేదికను డీఈవోకు అందజేస్తామని డీవైఈవో తెలిపారు. విద్యార్థినులపై హెచ్‌ఎం లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ప్రాథమిక విచారణలో నిర్ధారణ కావడంతో అతనిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్టు కరప ఎస్ఐ తోట సునీత తెలిపారు.

'టిస్' ఆధారంగా సీనియారిటీ జాబితా

కాకినాడ రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్ కింద పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాను ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టిస్) ఆధారంగా రూపొందించినట్టు పాఠశాల విద్య జోన్-2 ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. ఈ జాబితాలను సంబంధిత ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాల వెబ్‌సైట్‌లోనూ, నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 10లోపు సంబంధిత ఉమ్మడి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోసమర్పించాలని సూచించారు.

మరణంలోనూ వీడని స్నేహం!

● రామవరంలో రోడ్డు ప్రమాదం ● ట్రాలీని ఢీకొని ముగ్గురు యువకుల మృతి



జగ్గంపేట మండలం రామవరంలో సంఘటనా స్థలం వద్ద మృతదేహాలు



అబ్దుల్లా (ఫైల్)



హర్షవర్ధన్ (ఫైల్)



మణికంఠ (ఫైల్)

జగ్గంపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ప్రాణ స్నేహితులైన ముగ్గురు యువకులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... షేక్ అబ్దుల్లా (17), రౌతుల హర్షవర్ధన్ (17), వేణు మణికంఠ కిర్లంపూడి మండలం బూరుగుపూడి నుంచి ఒకే మోటారు సైకిలుపై జగ్గంపేట బయల్దేరారు. రామవరం వచ్చేసరికి ట్రాలీని దాటించబోయి దాన్ని ఢీకొన్నారు. ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా మణికంఠ(17) స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ట్రాలీ నడుపుతున్న డ్రైవర్ పరారీలో ఉన్నట్టు స్థానిక సీఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న సామాజిక ఉద్యమకారుడు పాఠంశెట్టి సూర్యచంద్ర ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించి ఓదార్చారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద జగ్గంపేట వైసీపీ ఇన్‌చార్జ్ తోట నరసింహం, తోట రాంజీ మృతుల కుటుంబీకులను పరామర్శించారు.

కుటుంబాల కోసం కూలీపనుల్లోకి...

ప్రమాదంలో మరణించిన రౌతుల హర్షవర్ధన్, వేణు మణికంఠ కిర్లంపూడి మండలం బూరుపూడి గ్రామానికి చెందినవారు. మరొక యువకుడు షేక్ అబ్దుల్లా ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామం అని స్థానికులు తెలిపారు. వారు ముగ్గురు ప్రాణ స్నేహితులు. పదో తరగతి వరకు చదువుకున్నారు. తర్వాత ఆర్థిక పరిస్థితి రీత్యా స్థానికంగా కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని సాయపడుతున్నారు. షేక్ అబ్దుల్లా తండ్రి కిర్లంపూడి మండలం బూరుగుపూడి సాగు ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. చేతికందివచ్చిన కొడుకులు ప్రమాదంలో మరణించడంతో తల్లిదండ్రులు విలపిస్తున్నారు.

ఉలిక్కి పడ్డారు!

» కాకినాడలో ఉల్లిబాంబుల పార్శిల్ దింపుతుండగా భారీ పేలుడు

» ఐదుగురు హమాలీలకు గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం



లారీ నుంచి పార్శిల్ దించుతున్న దృశ్యం



భారీ పేలుడు సంభవించిన ప్రాంతం



పార్శిల్‌లో వచ్చిన ఉల్లి బాంబుల డబ్బాలు

కాకినాడ క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని ఓ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో సోమవారం ఉల్లిబాంబుల భారీ పేలుడు సంభవించి ఐదుగురు హమాలీలకు గాయాలయ్యాయి. ఈ ఘటనలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జగన్నాథపురం కమర్షియల్ రోడ్డులోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరం ఉన్న జై బాలాజీ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీకి హైదరాబాద్‌లో ఉన్న అదే ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ నుంచి సోమవారం ఉదయం పార్శిల్ లారీ వచ్చింది. ఈ క్రమంలో అక్కడ ఉన్న హమాలీలు ఒక్కో పార్శిల్‌ను కిందకు దించుతున్నారు. గజ్జల మధు అనే హమాలీ లారీ నుంచి ఒక పార్శిల్‌ను దించుతూ కిందకు పడవేశాడు. దీంతో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. దీంతో అక్కడ విధుల్లో ఐదుగురు హమాలీలు చెల్లాచెదురుగా ఎగిరిపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను 108 వాహనంలో జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారిలో స్థానిక డైరీఫాం సెంటర్‌కు చెందిన 35ఏళ్ల గజ్జల మధు, అదే ప్రాంతానికి చెందిన 32ఏళ్ల మేడిశెట్టి లోవరాజు, కాకినాడ రూరల్ మండలం ఏపీఎస్పీ ప్రాంతానికి చెందిన 30ఏళ్ల బొందు అశోక్, ఇంద్రపాలెం గ్రామానికి చెందిన 39ఏళ్ల దారా నగేష్, అదే ప్రాంతానికి చెందిన 55ఏళ్ల బందాల పోతురాజు ఉన్నారు. మధు పరిస్థితి విషమంగా ఉన్నట్టు జీజీహెచ్ అత్యవసర విభాగ వైద్యులు తెలిపారు.

ఘటన అనంతరం కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్, కాకినాడ ఎస్‌డీపీవో, ఐపీఎస్ అధికారి మనీష్‌దేవరాజ్ పాటిల్, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటన జరగడానికి ప్రధాన కారణం చిన్న పిల్లలు గోడకేసి కొట్టే ఉల్లిపాయ టపాసులని ఎస్పీ వెల్లడించారు. స్థానిక పెద్దమార్కెట్‌లో జనరల్ స్టోర్స్ నిర్వహిస్తున్న మాజేటి శ్రీనివాసరావు హైదరాబాద్ నుంచి జై బాలాజీ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన లారీలో ఒక్కో ప్లాస్టిక్ డబ్బాలో 60 ఉల్లిబాంబులు ఉండేలా ప్యాక్ చేశారు. ఒక్కో పార్శిల్‌లో 30 డబ్బాల చొప్పున 3 పార్సిల్‌లు దిగుమతి చేసుకున్నాడు. అందులో మొదటి పార్సిల్ దింపుతుండగా ఈ విస్ఫోటనం జరిగింది. దీంతో మరో పార్శిల్‌లో ఉన్న పెద్ద పెద్ద నట్లు, బోల్టులు చెల్లాచెదురుగా ఎగిరిపడి హమాలీలకు కాలిన గాయాలయ్యాయి. దీనిపై కాకినాడ వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావ్ కేసు నమోదు చేశారు.

బుకీలు.. బుక్కయ్యారు!

» ఇండియా-న్యూజిలాండ్ మ్యాచ్‌పై బెట్టింగ్ నిర్వహించిన ఆరుగురి అరెస్ట్

» 4 ల్యాప్‌టాప్‌లు, ఎల్ఈడీ టీవీ, 2 లైన్‌బాక్స్‌లు, 2 ట్యాబ్‌లు,50ఫోన్లు స్వాధీనం

» రూ.7.38 లక్షలు నగదు కలిగిన ఖాతా ఫ్రీజ్

రాయవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం రాత్రి జరిగిన భారత్ - న్యూజిలాండ్ క్రికెట్ మ్యాచ్‌పై ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహించిన రెండు బెట్టింగ్ స్థావరాలపై దాడి చేసి ఆరుగురు క్రికెట్ బుకీలను అదుపులోకి తీసుకున్నట్టు రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ సోమవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం సోమేశ్వరం గ్రామంలో క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్టు వచ్చిన విశ్వసనీయ సమాచారంపై జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాలపై పోలీసులు బెట్టింగ్ స్థావరంపై దాడులు నిర్వహించారు. సోమేశ్వరం వినాయక కాలనీకి చెందిన లింగాపు సతీష్‌కు చెందిన ఇంట్లో బెట్టింగ్ జరుగుతుండగా బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమేశ్వరం బుకీలు ఇచ్చిన సమాచారంపై ఇక్కడి బెట్టింగ్ స్థావరానికి అనుగుణంగా రాజానగరం మండలం చక్రధారబందం ఒక అపార్ట్‌మెంట్‌లో యమునా బ్లాక్ ప్లాట్ నెంబరు 605లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న మరో నలుగురు బుకీలను అదుపులోకి తీసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. సోమేశ్వరం, చక్రధారబందం గ్రామాల్లో జరిగిన రెండు బెట్టింగ్ స్థావరాలపై దాడులు జరిపి కె.నాగేంద్ర, కేపీ రెడ్డి, ఎన్.రవి, ఎ.వినయ్, జి.గణేష్, పి.వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు. సోమేశ్వరం గ్రామానికి చెందిన లింగాపు సతీష్ పరారీలో ఉన్నట్టు చెప్పారు. సోమేశ్వరం, చక్రధారబందం గ్రామాల్లో జరిపిన దాడుల్లో 2 క్రికెట్ లైన్ బాక్స్‌లు, 4 ల్యాప్‌టాప్‌లు, వాయిస్ రికార్డర్, ఒకటీవీ, 2 ట్యాబ్‌లు, సుమారు 50 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహణకు వాడిన ఖాతాను స్వాధీనం చేసుకుని ఆ ఖాతా నుంచి 7లక్షల 38వేల రూపాయలు నగదు కలిగిన ఖాతాను ఫ్రీజ్ చేసినట్టు తెలిపారు. క్రికెట్ బుకీల ఫోన్ నెంబర్లు ఆధారంగా దర్యాప్తు చేసి ఈ కేసులో ఇంకా ఎంతమంది ఉన్నారు అనే విషయంపై దర్యాప్తు జరుగుతుందన్నారు. బెట్టింగ్ నిర్వహిస్తున్న సోమేశ్వరంతో పాటు పరిసర ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉంటుందని డీఎస్పీ తెలిపారు. బెట్టింగ్ స్థావరాలపై దాడులు నిర్వహించేందుకు వ్యవహరించిన మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, మండపేట రూరల్ ఎస్ఐ బుజ్జిబాబు, రాయవరం ఎస్ఐ సురేష్‌బాబు, ఏఎస్ఐ అప్పారావు, హెచ్‌సీ పి.వీర్రాజు, సత్యనారాయణ మూర్తి, కె.లక్ష్మీనారాయణ, శివ, స్వామి, గన్నియ్య, వంశీ, అప్పన్నకుమార్, వీరేంద్ర, సుధాకర్ కుమారిలను డీఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘువీర్



పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు

చేబ్రోలులో గుర్తు తెలియని వ్యక్తి హత్య!



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

గొల్లప్రోలు రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డు చెంతనే గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మరణించి ఉండగా సోమవారం పోలీసులు కనుగొన్నారు. అతడిని హత్య చేసి ఇక్కడకు తెచ్చి పడవేసినట్టు భావిస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నివాసానికి సమీపంలో ఈ సంఘటన జరగడం కలకలం రేపింది. చేబ్రోలు బైపాస్ రోడ్డు(ఎన్‌హెచ్ 216) పోలవం కాలువ సమీపంలో మరణించి ఉన్న ఆ వ్యక్తి వయస్సు సుమారు 40-50 ఏళ్లు ఉంటుంది. గుర్తు తెలియని వ్యక్తులు అతడిని ఇక్కడే హత్య చేయడం లేదా, మరో ప్రాంతంలో హత్య చేసి ఇక్కడ పడవేసి ఉండవచ్చని భావిస్తున్నారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎవరు హత్య చేశారు అనే విషయం విచారణలో తేలుతుందని ఎస్పీ తెలిపారు. ఈ కేసును చాలెంజ్‌గా తీసుకుని దర్యాప్తు వేగవంతం చేయాలని సీఐ శ్రీనివాస్‌ను ఆదేశించారు. మృతుడి చేతికి రాగికడియం ఉందని, వివరాలు తెలిసిన వారు పిఠాపురం సీఐ సెల్ 9440796523 లేదా గొల్లప్రోలు ఎస్ఐ సెల్ 9440900758 లేదా పోలీసు కంట్రోల్‌రూమ్ సెల్ 9494933 233కు తెలియజేయాలని ఎస్పీ సూచించారు.

హత్యా నేరం రుజువు కావడంతో యువకుడికి జీవిత ఖైదు

రాజమహేంద్రవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): హత్యా నేరం రుజువు కావడంతో ఓ యువకుడికి జీవిత ఖైదు విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. త్రీటౌన్ సీఐ వి.అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. పాత గొడవల నేపథ్యంలో సీటీఆర్ఐ ప్రాంతానికి చెందిన జీరి వెంకట తేటయ్యను అదే ప్రాంతంలోని దుర్గానగర్‌కి చెందిన యర్రా సాయి (సాయి కిరణ్, షూటర్‌సాయి, దొంగ సాయి) 2021 సెప్టెంబరు 9 తెల్లవారుజామున చాకుతో విచక్షణా రహితంగా పొడిచాడు. అక్కడే ఉన్న సర్వే కర్ర, రాయితో తలపై బలంగా కొట్టి చంపేశాడు. మృతుడి తల్లి జీరి జయలక్ష్మి ఫిర్యాదుతో అప్పటి సీఐ మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, రూ.20 వేల జరిమానా విధిస్తూ పదో అదనపు జిల్లా జడ్జి ఆర్.శ్రీలత తీర్పు వెలువరించారని సీఐ తెలిపారు.

తాచుపాము హల్‌చల్
ముమ్మిడివరం, మార్చి3(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం జనతా క్లినిక్ ఆసుపత్రి వద్ద రోడ్డుపై ఆదివారం రాత్రి ఓ తాచుపాము హల్‌చల్ చేసింది. రోడ్డుపై తాచుపాము బుసలు కొట్టడంతో స్థానికులు, రోగులు భయభ్రాంతులకు గురయ్యారు. స్నేక్‌క్యాచర్ వర్మ తాచు పామును డబ్బాలో బంధించి సురక్షిత ప్రాంతానికి తరలించారు.

51మద్యం సీసాలు స్వాధీనం
పి.గన్నవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం రైస్‌మిల్లు సమీపంలో మద్యం విక్రయిస్తున్న నల్లి వీరవెంకటరమణను అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ కాత్యాయిని తెలిపారు. అతడి వద్ద నుంచి 51మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రోడ్ల నిర్మాణంలో జియో టెక్స్‌టైల్స్ మేట్లు వినియోగించాలి

అమలాపురం టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బీటీ, సీసీ రోడ్ల నిర్మాణాలతో పాటు కాల్వగట్ల అభివృద్ధిలో లూజు సోయిల్ ఉన్నచోట్ల జియో టెక్స్‌టైల్ మేట్లు వినియోగించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. మేట్ల వినియోగంతో పది కాలాల పాటు రోడ్లు మన్నికగా ఉండడంతో పాటు స్థానికంగా ఉన్న కొబ్బరి పీచు పరిశ్రమలకు డిమాండ్ కల్పించే అవకాశం ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, జిల్లా యాజమాన్యం సంస్థ అధికారులు, ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. జియో టెక్స్‌టైల్ మేట్ల వినియోగించి రోడ్ల


ఇంజనీరింగ్ అధికారులకు అర్థమయ్యేవిధంగా వివరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

నిర్మాణం చేపట్టడం వల్ల స్థానికంగా క్వాయర్ పరిశ్రమలు నెలకొల్పేందుకు గల అవకాశాలపై ఆయన సమీక్షించారు. జియో టెక్స్‌టైల్, జియో

కొబ్బరి పీచు పరిశ్రమలకు డిమాండ్ కల్పించాలి: కలెక్టర్ మహేష్‌కుమార్

సింథటిక్ పేపరు వినియోగంపై ఇంజనీర్లకు కలెక్టర్ స్వయంగా అవగాహన కల్పిస్తూ బోర్డు ద్వారా వివరించారు. ఆయా రోడ్ల నిర్మాణానికి ఎంతమేర ఖర్చు అవుతుందో అంచనాలు రూపొందించి వారం రోజుల్లో నివేదించాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఈ పి.రామకృష్ణారెడ్డి, డీఈఈ అన్యం రాంబాబు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఆర్‌అండ్‌బీ డీఈ బీవీఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలి


విద్యాశాఖ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న డీఆర్వో రాజకుమారి

110పరీక్షా కేంద్రాలు ఏర్పాటు: డీఆర్వో

అమలాపురంటౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఈనెల17 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో సోమవారం పదో తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి సన్నద్ధతత ఏర్పాట్లపై జిల్లా విద్యాశాఖ లైన్ డిపార్టుమెంటు అధికారులతో డీఆర్వో సమీక్షించారు. పదో తరగతి పరీక్షలకు జిల్లాలో 19,217మంది విద్యార్థుల కోసం 110పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు రాయబోయే విద్యార్థుల్లో ఎవరికైనా భయం ఉంటే పోగొట్టి వారిలో స్ఫూర్తిని నింపాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరీక్షలకు ఇంకా పదమూడు రోజులు మాత్రమే సమయం ఉందన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధచూపి ఉత్తీర్ణత పొందేలా చూడాలన్నారు. ఒత్తిడిని తట్టుకుని పరీక్షలను ప్రశాంతంగా రాసేవిధంగా ప్రోత్సహించాలన్నారు. పరీక్షా కేంద్రాల రోడ్లలో ఆర్టీసీ బస్సులు ప్రత్యేకంగా నడపాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేలా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. డీఈవో షేక్ సలీంబాషా, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బీర హనుమంతరావు, ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నకిలీ దస్తావేజు కేసులో నిందితుడి అరెస్టు
రాజోలు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నకిలీ దస్తావేసు కేసులో నిందితుడిని అరెస్టు చేశామని ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ సోమవారం తెలిపారు. రాయవరం మండలం వెంటూరుకు చెందిన వి.రామసుబ్బారాయులు రామచంద్రపురం మండలం నర్సాపురపుపేటకు చెందిన పిల్లి సూర్యనారాయణ అలియాస్ సూరిబాబుతో చేతులు కలిపి రాజోలుకు చెందిన స్టాంపు వెండర్ సహకారంతో మరణించిన వ్యక్తి సంతకం ఫోర్జరీ చేసి దొంగ వీలునామా తయారుచేశారు. ఈకేసులో నిందితుడిగా ఉన్న సూర్యనారాయణను అరెస్టు చేశామని తెలిపారు. సూర్యనారాయణ పశుసంవర్ధకశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. సూర్యనారాయణను రాజోలు కోర్టులో హాజరుపరచగా జడ్జి 14రోజులు రిమాండు విధించారని ఎస్ఐ తెలిపారు.

అంతర్వేదిలో బోల్తా కొట్టినకారు

అంతర్వేది, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం అంతర్వేది కొత్తపేట సెంటర్ వద్ద రోడ్డుపై వేసిన కంకరగుట్టను తప్పించబోయి పల్టీలు కొట్టిన కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. పెద్ద శబ్దం రావడంతో స్థానికులు కంగారు పడి బయటికి వచ్చి చూసేసరికి కారు బోల్తా పడి ఉంది. కారులో ఉన్న డి.రవికుమార్‌ను బయటికి తీసి స్వల్ప గాయాలవ్వడంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆదివారం రాత్రి 10గంటలకు జరిగిన రోడ్డు ప్రమాద సన్నివేశాలను చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. త్రిఫేజ్ విద్యుత్ లైన్ కరెంటు స్తంభం కారు ఢీకొనడంతో సగానికి విరిగి రోడ్డుపై పడి ఉండడంతో అటు విద్యుత్ ప్రమాదం, ఇటు కారు ప్రమాదం నుంచి రవికుమార్, స్థానిక గ్రామస్తులు సురక్షితంగా బయటపడ్డారు. ఎటువంటి ప్రాణాపాయం జరగకపోవడం అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డు ప్రమాదంలో విరిగిన విద్యుత్ స్తంభాలను విద్యుత్ అధికారులు పునరుద్ధరించి వాటి స్థానంలో కొత్తవాటిని వేసి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.



మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



ఐ.పోలవరం, మార్చి3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని మాదిగ ముఖ్య నాయకులు విజ్ఞప్తి చేశారు. మురమళ్ల చెయ్యేటివారిపేటలో టీడీపీ ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చెయ్యేటి శ్రీనుబాబు అధ్యక్షతన సోమవారం మాదిగల సమావేశం జరిగింది. జిల్లాలో మాదిగలకు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ కేటాయించాలని నాయకులు కోరారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం లేదని యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. జిల్లాలో మాదిగలకు ఒక ఎమ్మెల్యే సీటు కేటాయిస్తామని లోకేశ్ ఇచ్చిన హామీని వారు గుర్తు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే కోటాలో ఒకరికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో నేదునూరి వీర్రాజు, రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు ఆకుమర్తి ఆశీర్వాదం, సత్తాల ప్రసాద్, పెదపూడి శ్రీనివాసరావు, చుట్టుగుళ్ళ కిశోర్, చుట్టుగుళ్ళ నీలకంఠం, గంపల లోవరాజు, సవరపు వెంకటరమణ, అయినవిల్లి వలియాబాబా, పెదపూడి రుక్మిణి, సెట్టెం శ్రీను, దిగుమర్తి చిట్టిబాబు పాల్గొన్నారు.

శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


అమలాపురం రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పాలగుమ్మి కంభంపాడు బీసీ కాలనీలో 21అడుగుల శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. శిలామయ విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని శ్రీనివాసుల విజయ్ గోపాలాచార్యుల ఆచార బ్రహ్మత్వంలో ఆగమ పండితులు నిర్వహించారు. మహాశాంతి హోమం, మహాపూర్ణాహుతిని కేతా వెంకటేశ్వరరావు-గౌరీపార్వతి, కేతా భానుతేజ-సాయిప్రవల్లిక దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, నాయకులు దొంగ శ్రీను, దంగేటి రుద్ర పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి
అమలాపురంటౌన్,మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లవంతెన దిగువన ఉన్నహిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టాలని అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. 15రోజుల్లో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో కమిటీ సభ్యులు వంటెద్దు వెంకన్నాయుడు, కముజు రమణ బృందం వెనుదిరిగారు.

ప్రజల గుండెల్లో బాలయోగి చిరస్థాయిగా ఉంటారు

- పలు మండలాల్లో బాలయోగి వర్ధంతి
- నివాళులర్పించిన కూటమి నాయకులు



అమలాపురం: బందారులంకలో బాలయోగి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు
ముమ్మిడివరం: బాలయోగి విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

అమలాపురంరూరల్, మార్చి3(ఆంధ్రజ్యోతి): కోనసీమ అభివృద్ధి ప్రదాతగా దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి పేర్కొన్నారు. బండారులంక పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం బాలయోగి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన నిలువెత్తు విగ్రహం ఎదుట చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పెనుమాల సునీత, సొసైటీ మాజీ అధ్యక్షుడు పుత్సల వరదరాజులు, మాజీ ఎంపీటీసీలు చింతపట్ల గంగాసత్యనారాయణ, మాడా మాధవి, గుమ్మడి సత్తిబాబు, చందన రాజు, గంటి శ్రీను, కడించర్ల శ్రీను, బళ్ల మల్లేశ్వరరావుగురూజీ, కాశిన బాబి, యాళ్ల కుమార్, ఏకుల విజయ్, అల్లక నూకరాజు, తొత్తరమూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ స్పీకర్, దివంగత జీఎంసీ బాలయోగి వర్ధంతిని ముమ్మిడివరంలో సోమవారం నిర్వహించారు. పోలమ్మచెరువుగట్టున ఉన్న జీఎంసీ బాలయోగి విగ్రహానికి పలువురు పూలమాలలువేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద పాల్గొని జీఎంసీ బాలయోగి కోనసీమ ప్రాంతానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు చెల్లి అశోక్, గుత్తుల సాయి, తాడి నరసింహారావు, పొద్దోకు నారాయణరావు(బాలు), దొమ్మేటి రమణకుమార్, దాట్ల బాబు, అర్ధాని శ్రీనివాసరావు, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపి, కాశి లాజర్, యాళ్ల ఉదయ్, ఎస్.నాగరాజు, జనిపల్లి సత్యనారాయణ, మెండి కమల, వాసంశెట్టి అమ్మాజీ, కుడుపూడి మల్లేశ్వరి, ముమ్మిడివరపు వరలక్ష్మి, మట్ట సత్తిబాబు, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): జీఎంసీ బాలయోగి వర్ధంతిని పి.గన్నవరం అక్విడెక్టు వద్ద నిర్వహించారు. టీడీపీ ఆధ్వర్యంలో జరి గిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, పలువురు నాయ కులు బాలయోగి విగ్రహానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో చొల్లంగి సత్యనారాయణమూర్తి, బొండాడ నాగమణి, తోలేటి సత్యనారాయణమూర్తి, కొల్నాడ సత్యనారాయణరాజు, గుత్తుల రామకృష్ణ, నక్కా సత్యనారాయణ, బొరుసు సత్యనారాయణ, శేరు శ్రీనుబాబు, కొపనాతి సీతారామస్వామి, గుడాల సంపత్, రుద్ర గంగారావు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): భారతజాతి గర్వించే నాయకుడు జీఎంసీ బాలయోగి అని పలువురు నాయకులు పేర్కొన్నారు. బాలయోగి 23వ వర్ధంతి సందర్భంగా మలికిపురం, దిండిలో ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అడబాల యుగంధర్, జంపన సత్యనారాయణరాజు, పిండి సత్యనారాయణ, బొక్కా గోవిందు, బొల్లం ప్రసాద్, ఉయ్యూరి హరరాజు, దిండిలో జరిగిన కార్యక్రమంలో బందెల పద్మ, దేవ నరేష్, తాడి దుర్గాసురేష్, గోనిపాటి రాజు, కె.బాలరాజు పాల్గొన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో బాలయోగి వర్ధంతిని నిర్వహించారు. అంతర్వేదిపాలెం, టేకిశెట్టిపాలెం, కేశవదాసుపాలెం, కాల్వమొగ సెంటర్ తదితర గ్రామాల్లో బాలయోగి విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని, ప్రధాన కార్యదర్శి తాడి సత్యనారాయణ, యెనుముల సింహాచలం(బుజ్జి), యెనుముల శ్రీధర్, తాడి మోహన్‌బాబు (ఆర్ఎంపీ), బెల్లంకొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): కోనసీమ అభివృద్ధి ప్రదాత దివంగత లోక్ సభాపతి జీఎంసీ బాలయోగి సేవలు చిరస్మరణీయమని కూటమి నాయకులు పేర్కొన్నారు. బోడసకుర్రులో బాలయోగి విగ్రహానికి జనసేన నాయకుడు రొక్కాల నాగేశ్వరరావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు ముత్యాల బాబి, బీజేపీ నాయకుడు అడపా శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, మెయిల గణపతిరావు, చుట్టుగుళ్ల నీలకంఠం, రేళ్ల శ్రీనివాస్, దొమ్మేటి రాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి వర్ధంతిని సోమవారం జరుపుకున్నారు. పాతయింజరంలో బాలయోగి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానందతో పాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలయోగి స్వగ్రామం ఎదుర్లంకలో ఆయన వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమాల్లో ముదునూరి రామలింగరాజు, సాగిరాజు వాసురాజు, ముదునూరి వాసురాజు, పేరాబత్తుల రమణ, జనిపెల్ల గిరి పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): దివంగత నేత జీఎంసీ బాలయోగి ఆదర్శనీయుడని గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ కేతా శ్రీనివాస్‌లు అన్నారు. రాజోలు కాటన్ పార్కులో బాలయోగి విగ్రహానికి సోమవారం వారు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బూత్ కమిటీల కోఆర్డినేటర్ చాగంటి స్వామి, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, సూరిశెట్టి శ్రీనివాస్, ప్రభుత్వాసుపత్రి కమిటీ డైరెక్టర్ మటపర్తి లక్ష్మి, అడబాల విజయ్, కడలి వెంకటరమణారావు, జగడం సత్యనారాయణ, పామర్తి రమణ, కడలి నీటిసంఘం అధ్యక్షుడు గాలిదేవర వెంకన్నబాబు, కోళ్ల వెంకన్న, కట్టా సూరిబాబు, చెల్లింగి జాంబవతి, కాండ్రేగుల మణిబాబు, కడలి మోహన్, ఏడుకొండలు, బోళ్ల రాజేష్, పితాని భాస్కర్ పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంటర్లో బాలయోగి చిత్రపటానికి కూటమి నాయకులు పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో దాసరి వీరవెంకట సత్యనారాయణ, గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు, గుడాల ఫణి, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, అరిగెల బలరామమూర్తి, దంతులూరి శ్రీనురాజు, దొమ్మేటి సాయికృష్ణ, మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, రవణం రాము, నేదునూరి కల్యాణ్, అధికారపు బాబ్జి, కత్తుల బాబులు, పెదపూడి శ్రీనివాసరావు, మందా రాజేష్, గుబ్బల వెంకటరమణ పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి చేసిన సేవలు చిరస్మరణీయమని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు కొనియాడారు. పాశర్లపూడిలో బాలయోగి వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించి ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, సూదా బాబ్జి, వర్ధినేని బాబ్జి, దొంగ సత్తిబాబు, గంధం భాస్కర్, చుట్టుగుళ్ల కిశోర్, మల్లాడి విష్ణు, కడలి నూకరాజు, నక్కా త్రిలోచనరావు, పెచ్చెట్టి భాస్కరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిఉంటారని జీఎంసీ బాలయోగి చారిటబుల్ సొసైటీ కన్వీనర్ మోర్త సత్తిబాబు పేర్కొన్నారు. కె.జగన్నాథపురం శ్రీఉమామహేశ్వర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం బాలయోగి వర్ధంతి సభను నిర్వహించారు. జిల్లా కన్వీనర్ గిడ్ల వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై బాలయోగి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. హైస్కూలు కమిటీ అధ్యక్షుడు అంకం నాగమల్లేశ్వరరావు, శీరం కృష్ణనాగశంకరరావు, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు ములికి విఘ్నేశ్వరుడు, విళ్ల సుబ్బారావు, జలగం రాజు, వాసంశెట్టి శివమణి పాల్గొన్నారు.

యానాం, (ఆంధ్రజ్యోతి): యానాం సమాచారశాఖ ఆధ్వర్యంలో దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి వర్ధంతి నిర్వహించారు. యానాం పరిపాలనాధికారి కార్యాలయ సమీపంలో ఉన్న బాలయోగి కాంస్య విగ్రహానికి పరిపాలనాధికారి మునిస్వామి, సీఐ షణ్ముగం తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం బాలయోగి చేసిన సేవలను ఉపాధ్యాయుడు హంసని రామలక్ష్మణుడు వివరించారు. కార్యక్రమంలో యానాం సమాచారశాఖ అధికారి కేఎల్‌వీ ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ సభ్యుడికి సత్కారం
యానాం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గ పరిధిలో భారతమాత వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యుడు గోలుగుల సుబ్బారావు ప్రభావతి దంపతులు 50వ వివాహ వేడుక నిర్వహించారు. క్లబ్ సభ్యులను దంపతులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు, కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు గాదేరాజు సత్యనారాయణ, ఉపాధ్యాక్షుడు ఎం.సత్యనారాయణ, కార్యదర్శి మట్టా అదినారాయణమూర్తి, కోశాధికారి చింతలపూడి రాజా, సభ్యులు గోలుగుల సుబ్బారావు, సత్యనారాయణ, బస్వ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

కామన్వెల్త్ అసోసియేషన్‌లో డాక్టర్ శర్మ
అభినందనలు తెలిపిన కలెక్టర్



అమలాపురం టౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): 56 దేశాల సభ్యత్వం కలిగిన కామన్వెల్త్ మెడికల్ అసోసియేషన్‌లో అమలాపురం పట్టణానికి చెందిన డాక్టర్ పీఎస్ శర్మ సభ్యునిగా నియమితులు కావడం అభినందనీయమని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. క్షయవ్యాధినివారణ కోసం 12మంది సభ్యులతో కామన్వెల్త్ మెడికల్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన ఉపసంఘంలో భారతదేశం నుంచి ముగ్గురు డాక్టర్లను ఎంపిక చేశారు. వారిలో జిల్లాకు చెందిన డాక్టర్ పీఎస్ శర్మ సభ్యులుగా ఉన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో శర్మను అభినందించి క్షయవ్యాధి అపోహ నిర్మూలనపై ముద్రించిన ముద్రికలను కలెక్టర్ విడుదల చేశారు.

అరుదైన ఆపరేషన్
ఐ.పోలవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఆవుకు వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడారు. మురమళ్ళ మాణిక్యాంబానగర్‌కు చెందిన పురోహితుడు నాగాభట్ల రమేష్ పెంచుకుంటున్న పుంగనూరు ఆవు ప్రసవ వేదనతో ప్రాణాపాయ స్థితికి చేరింది. కాకినాడకు చెందిన వైద్యులు కృష్ణమూర్తి ఆవుకు ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడారు. అయితే దూడ చనిపోయింది, వైద్యులు ప్రవీణ్, సిబ్బంది పోలిశెట్టి సత్యనారాయణ ఈఆపరేషన్‌లో సహకరించారు.

పాఠశాల విలీనాన్ని తక్షణం నిలుపుదల చేయాలి

నిరసన తెలుపుతున్న దృశ్యం


అల్లవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అల్లవరం మండల పరిషత్ ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను సమీపంలో ఉన్న ఉన్నత పాఠశాలలో విలీనం చేయడంతో తల్లిదండ్రులు సోమవారం నిరసన తెలిపారు. ఇప్పటికే తల్లిదండ్రుల కమిటీ తీర్మానం సైతం చేసింది. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలకు విద్యార్థులను పంపలేమని తల్లిదండ్రులు పేర్కొన్నారు. కుక్కలు, ఆంబోతుల బెడదతో పాటు ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని విలీన ప్రక్రియ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరారు. కార్యక్రమంలో భీమేశ్వరరావు, ఎన్.సత్యవాణి, పి.దుర్గాభవానీ, వెంకటలక్ష్మి, ఎస్కే సుభానీ, కె.అలివేలు, దివ్యజ్యోతి, దుర్గ, ఆదిలక్ష్మి, సూర్యకుమారి పాల్గొన్నారు.

సర్పంచ్ బాలరాజుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి
అంబాజీపేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారనే ఆరోపణలు, గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు జరుగుతున్న ఇబ్బందులపై పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పుల్లేటికుర్రు టీడీపీ సమావేశం డిమాండ్ చేసింది. పుల్లేటికుర్రులో మాజీ ఎంపీపీ దాసరి వీరవెంకట సత్యనారాయణ ఇంటి వద్ద జరిగిన గ్రామశాఖ సమావేశంలో సర్పంచ్ బాలరాజును పార్టీని నుంచి సస్పెండ్ చేయాలని తీర్మానం చేసి అధిష్టానానికి పంపినట్టు డీపీ తెలిపారు.

బాల్య వివాహాలపై అవగాహన
ముమ్మిడివరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ పల్లవి పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ముమ్మిడివరం మహిళా శిశుసంక్షేమ శాఖ, పీపుల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అనాతవరంలో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. అనాతవరం ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జీవీఎస్ఎన్ దేవి, భవానీ, అంగన్‌వాడీ వర్కర్లు మాణిక్యాంబ, రాజేశ్వరి, నాగలక్ష్మి, సత్యకుమారి, ఉమామహేశ్వరి, పాఠశాల హెచ్ఎం పి.రమణికుమారి, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, పి.రాంజీ పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతం
ముమ్మిడివరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, తారా కళాశాల, మోకా గణపతిరావు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి మోకా గణపతిరావు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 639మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 579మంది పరీక్షలకు హాజరయ్యారని, 60మంది గైర్హాజరైనట్టు డి.విజయకుమారి తెలిపారు.

ఎంపీపీ పాలెపు లక్ష్మి మృతి



కాట్రేనికోన, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన ఎంపీపీ పాలెపు లక్ష్మి(56) అనారోగ్యంతో చికిత్స పొందుతూ అమలాపురం ఆసుపత్రిలో సోమవారం మృతి చెందారు. ఆమెకు భర్త, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆమె మృతికి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, జడ్పీటీసీ నేల కిశోర్‌కుమార్, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు గంటి వెంకటసుధాకర్, ఎంపీడీవో ఎస్వీ చలం, వైస్ ఎంపీపీలు సానబోయిన నాగేశ్వరరావు, ఏడిద అరుణ, ఎంపీటీసీలు సంతాపం తెలిపారు.

నిత్యసహాయమాత స్వరూపం ఆవిష్కరణ
అంబాజీపేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పుల్లేటికుర్రు నల్లావారిపేటలో కత్తుల సత్యనారాయణ- లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిత్య సహాయమాత స్వరూపాన్ని రెవ. ఫాదర్ వినయ్‌సాగర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా సర్పంచ్ జల్లి బాలరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నూకపెయ్యి చిన్న, కత్తుల బాలరాజు, కత్తుల బాలస్వామి, నెల్లి స్టాలిన్, కాగిత రాజీవ్‌ప్రసాద్, బీర సందీప్ పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు
అమలాపురంటౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మహిళపై దాడి చేసిన మాజీ భర్తతో పాటు పలువురిపై సోమవారం అమలాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ ఎస్ఐ టి.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక గొవ్వాలవారి వీధికి చెందిన పోలాబత్తుల లలితాదేవి భర్త నుంచి విడాకులు తీసుకుని అదే ప్రాంతంలో కుమారుడు, కుమార్తెతో కలిసి జీవనం సాగిస్తుంది. లలితాదేవి తన మాజీ భర్త సోదరుడైన సత్యవిష్ణుకు రూ.3.50లక్షలు అప్పుగా ఇచ్చింది. బాకీ తీర్చమని లలితాదేవి డిమాండ్ చేయడంతో అక్కసుతో గతనెల 28నసత్యవిష్ణుతో పాటు మాజీ భర్త సుబ్బారాయుడు, వారి కుటుంబ సభ్యులు దాడిచేసి గాయపరిచారు. గాయపడ్డ లలితాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కోనసీమ అభివృద్ధికి తోడ్పడండి
మలికిపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ కోనసీమ జిల్లా పర్యటనకు వచ్చారు. చించినాడలో బీజేపీ జిల్లా శ్రేణులు ఆయన్ను కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. కోనసీమ జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, అడబాల రాంబాబు, మేడిచర్ల చాణుక్య తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభను పండుగలా జరపాలి
మలికిపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఈనెల14న పిఠాపురంలో జరిగే జనసేన 12వ ఆవిర్భావ సభను విజయవంతం చేయడంలో అందరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఒక పండుగ వాతావరణంలో ఆవిర్భావ సభ జరగడానికి గ్రామగ్రామం నుంచి నియమితులైన కమిటీ సభ్యులు పనిచేయాలన్నారు. సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, మామిడికుదురు మండల కమిటీలతో పాటు వీర మహిళా కమిటీ, సోషల్ మీడియా కమిటీ, ప్రచార కమిటీ, ఆహార కమిటీలను నియమించి వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈకమిటీ సభ్యులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. జనసేన నాయకులు పెద్దకాపు, పినిశెట్టి బుజ్జి, దేశినీడి తాతాజీ, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, గుబ్బల ఫణి, మల్లిపూడి సత్తిబాబు, మేడిచర్ల రాము, దిరిశాల బాలాజీ పాల్గొన్నారు.

అమ్మవార్లకు దేవాంగుల సేవ
అంతర్వేది, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మోరి గ్రామంలో శ్రీమహాలక్ష్మమ్మ, కనకమహాలక్ష్మమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం దేవాంగుల ఆధ్వర్యంలో ఘనంగా మూడో సేవ నిర్వహించారు. మార్చి 9 నుంచి 15వరకు అమ్మవార్ల ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు విద్యుత్ అలంకరణలు, భారీ సెట్టింగులు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం రాత్రి వివిధ రకాల శక్తివేషధారణలతో బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి సేవ వైభవంగా జరిగింది.

దేవగుప్తంలో గెయిల్ సంచార వైద్యసేవలు
అల్లవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): దేవగుప్తం గ్రామంలో సోమవారం గెయిల్ ఇండియా ఆధ్వర్యంలో డాక్టర్ లక్ష్మీనారాయణ, సిబ్బంది గెయిల్ సంచార వాహనం ద్వారా వైద్యసేవలు అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో గెయిల్ సంచార వైద్యసేవలు ప్రజాదరణ పొందుతున్నాయి.

బాలకార్మికులతో పనిచేయిస్తే జైలుశిక్ష, జరిమానా
అంతర్వేది, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండల పరిధిలో బాల కార్మికులను గుర్తించడానికి కార్మిక, పోలీసు, ఐసీడీఎస్, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యాశాఖ సిబ్బంది, అధికారులు సంయుక్త నిర్వహణలో వ్యాపార దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. సఖినేటిపల్లి మూడు తూములు సెంటర్‌లో ఉన్న వ్యాపార సంస్థల్లో 18ఏళ్లలోపు బాలబాలికలు పనిలో ఉన్నారా లేదా అని తనిఖీ నిర్వహించారు. బాల కార్మికుల చట్టం ప్రకారం 18ఏళ్లలోపు బాలబాలికలను పనిలో పెట్టుకుంటే జైలు శిక్ష, జరిమానా విధిస్తామన్నారు. 18ఏళ్లలోపు పిల్లలు తప్పనిసరిగా చదువుకోవాలని, పనికి అనుమతించరాదని వారికి అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వ్యాపారస్తులు నడుచుకోవాలని కార్మిక, సహాయ అధికార కాశి శివనాగలమల్లేశ్వరరావు, మండల పోలీసు కానిస్టేబుల్ హర్షవర్ధన్ సూచించారు. మండల విద్యాశాఖ సిబ్బంది, సీఆర్పీ బి.కిశోర్‌కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.పూజిత, ఎస్.సుమ పాల్గొన్నారు.

జిల్లా అంతటా నిరసన కార్యక్రమాలు
ముమ్మిడివరం, మార్చి3(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షాభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్టుటైమ్ ఉద్యోగులంతా ఈనెల4,5తేదీల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా జేఏసీ చైర్మన్ సీహెచ్ వెంకన్నబాబు పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, పాఠశాలల్లో భోజన విరామ సమయంలో నిరసన చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం స్కేలు ఇవ్వకుండా జీవో నంబరు 2ను ఇచ్చిందని, ఆ జీవోను తక్షణం ఉపసంహరించుకుని వెంటనే ఉద్యోగులందరికీ మినిమం టైమ్ స్కేలు, హెచ్ఆర్‌పాలసీ అమలు చేయాలని, జీతంతో కూడిన మెడికల్ లీవ్‌లు అమలుపరచాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ సమ్మె ఒప్పందాలన్నీ కూటమి ప్రభుత్వం అమలుపరచాలనిప్రభుత్వానికి ఉద్యోగుల తరపున విజ్ఞప్తి చేస్తున్నట్టు వెంకన్నబాబు పేర్కొన్నారు.

చిన్నారులకు పాదరక్షలు పంపిణీ
ఉప్పలగుప్తం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గోపవరం అంగన్‌వాడీ కేంద్రంలోని 33మంది చిన్నారులకు గుడ్‌సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, వైసీపీ సీనియర్ నాయకుడు కుంచే రమణారావు పాదరక్షలు, సాక్స్ అందించారు. సోమవారం సర్పంచ్ కుంచే బుల్లియ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొంకి ఏడుకొండలు, జనసేన నాయకుడు ఏవీ కృష్ణారావు, ఓగూరి విజయకుమార్, కుంచే బాబులు, పందిరి సుబ్బరాజు, అంగన్‌వాడీ సిబ్బంది గోసంగి బేబీకుమారి, కుంచే దుర్గాభవాని, గుడ్‌సీడ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు ధ్వంసం
అంబాజీపేట, మార్చి3(ఆంధ్రజ్యోతి): రాజోలు, పి.గన్నవరం సర్కిల్స్ పరిధిలోని స్టేషన్లలో అనధికార మద్యంఅమ్మకాల్లో సీజ్ చేసిన రూ.90లక్షలు విలువైన మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. ఎస్పీ బి.కృష్ణారావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్కేబీవీ ప్రసాద్ ఆదేశాలతో కొత్తపేట సబ్‌డివిజన్ పరిధిలోని ఏడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 258 కేసులకు సంబంధించిన మద్యాన్ని అంబాజీపేట మార్కెట్ యార్డు గ్రౌండులో సోమవారం ధ్వంసం చేసినట్లు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ తెలిపారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రాజోలు, పి.గన్నవరం సర్కిల్స్ పరిధిలోని స్టేషన్లలో పలు కేసుల్లో సీజ్‌చేసి ఆరేళ్ల నుంచి నిల్వ ఉంచిన 9124 బాటిళ్ల 2700 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేశామన్నారు. అలాగే వివిధ కేసుల్లో సీజ్ చేసిన 300 లీటర్ల సారాను గోతిలో పారాబోశారు. పి.గన్నవరం, రాజోలు సీఐలు రుద్రరాజు భీమరాజు, టీవీ నరేష్‌కుమార్, ఎస్ఐలు చిరంజీవి, శివకృష్ణ, చైతన్యకుమార్, జోషి, రాజేష్‌కుమార్, సురేష్, శ్రీనివాస్, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరిండెంట్ వీటీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

వాడపల్లి ఒకరోజు ఆదాయం రూ.2.60లక్షలు

ఆత్రేయపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,60,639 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన ఇమ్మంది ప్రదీప్, సూర్యకుమారి దంపతులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. దాతలకు స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

ఏప్రిల్ 7 నుంచి వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు: వాడపల్లి వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వచ్చేనెల 7 నుంచి 13 వరకు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 8న స్వామివారి రథోత్సవం, కల్యాణం, తీర్థం జరగనున్నాయి. ఈ నేపధ్యంలో ఈనెల 6న తొలిదఫా సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. గురువారం ఉదయం ఆలయ ప్రాంగణంలో ఆర్డీవో పి.శ్రీకర్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు ఉత్సవ ఏర్పాట్లపై సమీక్షిస్తారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చురుకుగా నిర్వహిస్తున్నట్లు ఉపకమిషనరు ఈవో తెలిపారు.


దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

హైకోర్టు ఆదేశాలతో అనధికార భవనం కూల్చివేత

రావులపాలెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రావులపాలెం శెట్టిబలిజనగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అనధికార భవనాన్ని కూల్చి వేసినట్టు పంచాయితీ కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్ తెలిపారు. శెట్టిబలిజ నగర్‌లో జీప్లస్-2 నిర్మాణానికి అనుమతులు పొంది నిబంధనలకు విరుద్ధంగా అనధికారికంగా జీప్లస్-6 నిర్మాణం చేపట్టడంతో అనుమతులు లేని ఈ భవనాన్ని కూల్చివేయాల్సిందిగా హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. దీంతో సోమవారం రెవెన్యూ, పోలీసు సహకారంతో అనధికారికంగా నిర్మించిన మూడు అంతస్తులను తొలగించామన్నారు.


భవనాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

సీజ్ చేసిన మద్యం సీసాలు ధ్వంసం


మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

రావులపాలెం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రావులపాలెం టౌన్, రూరల్ సర్కిల్ పరిధిలో గతంలో సీజ్ చేసిన మద్యంతో పాటు సారాను పోలీసులు ధ్వంసం చేశారు. రావులపాలెం, ఆలమూరు, కొత్తపేట, ఆత్రేయపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇటీవల మద్యం కేసుల్లో స్వాధీనం చేసుకున్న 11,687 మద్యం సీసాలు, 1944 లీటర్ల సారాను ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.అమర్‌బాబు ఆధ్వర్యంలో ధ్వంసం చేశామన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ ఎం.శేఖర్‌బాబు, రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్‌ఐలు కె.ఆశోక్, ఎం.రాము, జి.సురేంద్ర, వీఆర్వోలు కొండేటి సత్యప్రసాద్, చింతపర్తి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారుల నాణ్యత పరిశీలన

ఆలమూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చింతలూరులో నిర్మిస్తున్న సీసీ రోడ్లను ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు సోమవారం పరిశీలించారు. చింతలూరు నూకాంబిక ఆలయం నుంచి వెళుతున్న రోడ్డుకు మంజూరైన నిధులతో జరుగుతున్న పనుల నాణ్యతను సచివాలయ సిబ్బందితో ఎంపీడీవో చర్చించారు. రోడ్ల నాణ్యతలో రాజీ లేకుండా నిర్మాణాలు జరగాలని ఆయన తెలిపారు. అనంతరం ఇంటింటికి జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం కోసం సాగుతున్న సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎంపీడీవో రాజు కోరారు.


రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు


కె.గంగవరంలో డాక్టర్ బిందుకు సూచనలు చేస్తున్న జిల్లా వైద్యశాఖాధికారి వెంకట్రావు

కె.గంగవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గాలికుంటువ్యాధి నివారణలో భాగంగా సోమవారం యండగండి గ్రామంలో పశువులకు టీకాలు వేశారు. పామర్రు పశువైద్యశాఖాధికారి ఎం.బిందు ఆధ్వర్యంలో సిబ్బంది టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పశువైద్యశాఖాధికారి కె.వెంకట్రావు తనిఖీ చేశారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించి పశువుల కాపాడాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాధిని నివారించడమే లక్ష్యం

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధిని నివారించడానికి ఏడాదికి రెండుసార్లు వ్యాక్సిన్ వేస్తున్నట్టు పశువైద్యులు తెలిపారు. ఆలమూరు మండలం పినపళ్లలో సోమవారం గాలికుంటువ్యాధి నివారణ టీకాలను గుమ్మిలేరు, పినపళ్ల పశువైద్యాధికారులు సుభాష్, ఈదల శ్రీనివాస్ చౌదరిల ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు, రైతులు పాల్గొన్నారు.


పేరవరం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ కాత్యాయని

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

ఆత్రేయపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని పేర్కొన్నారు. సోమవారం పేరవరం జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు, డ్వాక్రా మహిళలు, గ్రామస్థులతో సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని ర్యాలీ జరిపారు. సర్పంచ్ విజయభారతి, నాగేశ్వరరావు, ఎస్‌ఐ కె.అన్నవరం, దుర్గాభవాని తదితరులు పాల్గొని సారాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అలరించిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు


శ్రీలక్ష్మి స్కూల్‌లో విద్యార్థుల ప్రదర్శన దృశ్యం

ఆలమూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం పెదపళ్ల శ్రీలక్ష్మి యూపి స్కూల్‌లో సోమవారం విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీలక్ష్మి యూపీ స్కూల్ అధినేత మట్టా నాగరాజు ఆధ్వర్యంలో స్కూల్ 48 వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శలు, కళారూపాలు, సందేశాత్మక ప్రదర్శనలు అలరించాయి. హుషారు గొలిపే నృత్యాలు, దేశభక్తి సందేశాత్మకంతో కూడిన కళారూపాలు, వీరులం భారత రక్షణ సైనికులం అంటూ చేసిన ప్రదర్శించిన దేశభక్తి గీతం చిన్నారులను ఉరూతలూగించింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

తాచుపాము హల్‌చల్

ముమ్మిడివరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం జనతా క్లినిక్ ఆసుపత్రి వద్ద రోడ్డుపై ఆదివారం రాత్రి ఓ తాచుపాము హల్‌చల్ చేసింది. రోడ్డుపై తాచుపాము బుసలు కొట్టడంతో స్థానికులు, రోగులు భయభ్రాంతులకు గురయ్యారు. స్నేక్‌క్యాచర్ వర్మ తాచు పామును డబ్బాలో బంధించి సురక్షిత ప్రాంతానికి తరలించారు.



ఆత్రేయపురం మండలం ర్యాలి ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన తిష్టవేసిన చెత్తకుప్ప. పక్క చిత్రంలో ర్యాలి రోడ్డు చెంతనే పేరుకుపోయిన చెత్త

ఎక్కడ చూసినా చెత్తకుప్పలే...?

• గ్రామీణ ప్రాంతాల్లో తాండవిస్తున్న అపారిశుధ్యం • హైస్కూల్, పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డు పక్కన చెత్త, కళేబరాలతో దుర్వాసన

ఆత్రేయపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలతో గ్రామీణ ప్రాంతాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యం నీరుగారుతోంది. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో పాటు పాలకులు పట్టించుకోకపోవడంతో పల్లెల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. అపారిశుధ్యం కారణంగా ప్రజలు అనారోగ్యం బారినపడుతూ ఆస్పత్రి పాలవుతున్న సందర్భాలున్నాయి. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. గ్రామాల్లో ఎక్కడ చెత్త అక్కడే ఉండిపోవడంతో దోమలు, ఈగలు వంటివి వ్యాప్తి చెందుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. మరోవైపు చెత్త సంపద కేంద్రాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా మేజర్ గ్రామమైన ర్యాలి హైస్కూల్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి పక్కనే చెత్తా చెదారంతో నిండిపోయింది. జంతు కళేబరాలతో పాటు కోడి, చేప వ్యర్థాలను రోడ్డు పక్కనే పడేయడంతో దుర్వాసన భరించలేక వాహనదారులు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అధికార యంత్రాంగం స్పందించి పేరుకుపోయిన చెత్తకుప్పలను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఈవోపీఆర్‌డీకి గాయాలు

మండపేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి) మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ విస్తరణ అధికారిగా పనిచేస్తున్న దాసరి శ్రీనివాసు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆదివారం ఆయన మార్కెట్‌లో పని చూసుకుని ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రాజారత్న సెంటరులో ఆటో రోడ్డుకు అడ్డంగా తిరిగింది. దీంతో వెనక వస్తున్న శ్రీనివాస్ బైక్‌ను అదుపు చేసే క్రమంలో పడిపోవడంతో గాయాలయ్యాయి. వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా కుడికాలికి ఆపరేషన్ అవసరమని వైద్యులు చెప్పారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను మండపేట ఎంపీడీవో సత్యనారాయణ మూర్తి, పరిపాలన అధికారి ప్రసాద్, ఏఈ నాగేశ్వరరావు తదితరులు పరామర్శించారు.

అదనపులోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ

ద్రాక్షారామ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీతో అవకాశం కల్పించినట్టు ఏపీఈపీడీసీఎల్ డీఈఈ కె.రత్నాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాయితీ సౌకర్యం కోసం ఈనెల 1 నుంచి జూన్ 30 వరకు ఏపీ ఈపీడీసీఎల్ వెబ్‌సైటులో గాని లేదా ఉప కేంద్రంలోని అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. తనిఖీల సమయంలో అధికలోడు వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే అధికారులు అపరాధ రుసుం విధిస్తారని తెలిపారు. వినియోగదారులు రాయితీ సౌకర్యాన్ని వినియోగించుకుని క్రమబద్ధీకరించుకోవాలని ఆయన కోరారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్

అనపర్తి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం కేశవరం, అనపర్తి మండల లక్ష్మీనరసాపురం గ్రామాల వద్ద రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలకు రైల్వేశాఖ అనుమతులు మంజూరు చేస్తూ సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తెలిపారు. త్వరలో వాటికి అవసరమైన భూసేకరణ నిర్వహించడంతో బాటు పనులు కూడా చేపడతారన్నారు.

విద్యుదాఘాతానికి గురైన వ్యక్తికి పరిహారం చెల్లింపు

ఆలమూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గుమ్మిలేరులో గత ఏడాది జరిగిన ఘటనలో విద్యుదాఘాతానికి మృత్యువాతపడిన వ్యక్తి రూ.5లక్షల నష్టపరిహారాన్ని విద్యుత్ శాఖ చెల్లించింది. గుమ్మిలేరు గ్రామానికి చెందిన కౌలురైతు ముచ్చారి వీర్రాజు గత ఏడాది ఆగస్టు 16న గడ్డికోసం వెళ్లగా, చెరువుగట్టుపై ఉన్న విద్యుత్ వైర్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనికి సంబంధించిన వార్తలు ప్రతికల్లో రావడంతో కృష్ణాజిల్లా ఉయ్యూరుకు చెందిన సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్ వాటి ఆధారంగా ఆగస్టు 19న లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీంతో లోకాయుక్త స్పందించి జస్టిస్ లక్ష్మణరెడ్డి ఆదేశాలు జారీ చేయడంతో విద్యుత్‌శాఖ వీర్రాజు భార్య మమతకు రూ.5లక్షల నష్టపరిహారం చెల్లించారని సామాజిక కార్యకర్త జంపన శ్రీనివాస్ సోమవారం తెలిపారు.


రాయవరం జూనియర్ కళాశాలలో విద్యార్థుల హాల్ టిక్కెట్లను పరిశీలిస్తున్న దృశ్యం

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతం

రాయవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా సాగాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించగా రాయవరం జూనియర్, స్థానిక విజ్ఞాన్ జూనియర్ కళాశాలకు చెందిన తెలుగు పరీక్షలకు 30 మంది విద్యార్థులు హాజరుకాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. సంస్కృతం పరీక్షకు 115 మంది విద్యార్థులు హాజరుకాగా ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ డీవీవీ నాగేశ్వరరెడ్డి తెలిపారు.


ఆలమూరులో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రాజు

తడిపొడి చెత్తలతో సంపద సృష్టించాలి

ఆలమూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వచ్చే చెత్తతో సంపద సృష్టించాలని ఎంపీడీవో ఎ.రాజు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆలమూరులో చెత్త సేకరణ కేంద్రంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. మండలంలోని సంధిపూడి, పినపళ్ల, పెదపళ్ల, చింతలూరు గ్రామాలు మినహా మిగిలిన గ్రామాల్లో చెత్త సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ నాలుగు గ్రామాలలో కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

రాయవరం(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై 4న పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన తెలిపారు. సోమవారం ఎంపీడీవో మాట్లాడుతూ ఈ అవగాహన సదస్సుకు తప్పనిసరిగా ఆయా శాఖల సిబ్బంది హాజరుకావాలని ఆయన తెలిపారు.

బాలయోగికి పలువురు నివాళులు


కొత్తపేటలో పాత బస్టాండ్ సెంటర్లో బాలయోగికి నివాళులర్పించిన టీడీపీ శ్రేణులు

రావులపాలెం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి వర్ధంతిని జరిపారు. ఈసందర్భగా క్యాంపు కార్యాలయం వద్ద బాలయోగి చిత్రపటానికి టీడీపీ శ్రేణులు నివాళులర్పించారు. కార్యక్రమం లో నాయకులు గుత్తుల పట్టాభి రామారావు, కాసా విజయసాగర్, సిద్దిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): దివంగత బాలయోగి వర్ధంతిని సోమవారం పాత బస్టాండ్ సెంటర్లో టీడీపీ శ్రేణులు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కంఠంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ బూసి జయలక్ష్మి, బి.భాస్కరరావు, పాలూరి సత్యానందం, బీర ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు తడిపొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రంగారావు, మున్సిపల్ ఉద్యోగులు

తడిపొడిచెత్తను సద్వినియోగం చేసుకోండి

మండపేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): తడిపొడి చెత్తను వేరుచేసి సేంద్రియ ఎరువుగా తయారుచేసి మొక్కలకు ఎరువుగా వాడుకోవచ్చని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు ప్రజలకు తెలిపారు. సోమవారం మండపేటలోని 29వ వార్డులో ఆయన పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పన్నులు కూడా నిర్ణీత వ్యవధిలో చెల్లించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌వో శాస్త్రి, మున్సిపల్ డీఈఈ శ్రీనివాస్, ఏఈలు అంజనేయులు, పవన్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ రేసులో ఆశావహులు

మండపేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరుకు నామినేటెడ్ పోస్టుల భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో ఆశావహుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. నియోజకవర్గ పరిధిలో గల మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గిరి బీసీ జనరల్‌కు కేటాయించటంతో ఈసారి తమకే పదవి దక్కుతుందన్న గంపెడు ఆశతో తెలుగు తమ్ముళ్లు వున్నారు. నియోజకవర్గస్థాయిలో ఎమ్మెల్యే తర్వాత రెండోస్థానంగా ఉండే ఎంఎంసీ చైర్మన్ రేసులో టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి, రాయవరం మండలానికి చెందిన మాజీ జెడ్‌పీటీసీ సభ్యుడు కాదా ప్రభాకరరావు పేర్లు వినిపిస్తున్నాయి. గతంలో ప్రభాకరరావు టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్రస్థాయిలో డైరెక్టర్ పదవితో పాటు జెడ్‌పీటీసీగా కూడా పనిచేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి పార్టీలో సీనియర్ అయినప్పటికీ ఇప్పటి వరకు నామినేటెడ్ పదవులు, రాజకీయ పదవులు కేవలం మండల అధ్యక్షుడు మినహా ఏ పదవీ చేయలేదు. దీంతో బీసీలకు ఇచ్చినట్టయితే సీనియర్ అయిన తనకే పదవి దక్కుతుందని ఆయన ఆశగా వున్నారు. మరోనేత రాయవరం మండలానికి చెందిన ప్రభాకరరావు పేరు కూడా తెరపైకి వచ్చింది. ఎంత మంది చైర్మన్‌గిరికి పోటీపడినా చివరికి ఎమ్మెల్యే వేగుళ్ల ఆశీస్సులు వున్న వారికే మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కుతుందని పలువురు సీనియర్‌లు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం ఇద్దరి పేర్లు తెరపైకి వచ్చినప్పటికీ చివరికి మరికొంత మంది కూడా పోటీపడే అవకాశాలు వున్నాయని తెలుస్తున్నది. త్వరలో భర్తీ కానున్న ఎంఎంసీ చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

చైర్మన్‌గిరి కోసం ఎదురుచూపులు



ఉచిత కంటి వైద్య శిబిరంలో పలువురికి పరీక్షలు

కె.గంగవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరపల్లి గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. జనసేన నాయకులు ఎల్.వి.ప్రసాద్ కంటి వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరంలో 50 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. అనంతరం పలువురికి మందులు పంపిణీ చేశారు. తొమ్మిది మందికి ఆపరేషన్ అవసరంగా గుర్తించారు. వీరిని ఆసుపత్రికి తరలించి ఆపరేషన్‌లు చేయనున్నట్లు వైద్యులు చెప్పారు. ఎంపీటీసీ తాడాల జానకిరామ్, జనసేన నాయకులు పాల్గొన్నారు.


లక్ష చామంతుల పూజలో జ్ఞానసరస్వతి అమ్మవారు

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ద్రాక్షారామ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలోనున్న జ్ఞాన సరస్వతి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పలు పూజలు జరిపారు. అమ్మవారిని వ్యాపారవేత్త పోతంశెట్టి విజయభాస్కరరెడ్డి, శ్రీవాణి దంపతులు అర్చకులు పెదపూడి సాయివిశ్వనాధశర్మ, విల్లూరి వీరభద్రరావులతో గణపతిపూజ, పుణ్యాహ వచనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం శత సహస్ర పుష్పార్చన (లక్ష చామంతి పూజ) జరిపారు. అనంతరం రథోత్సవం జరిగింది. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, ఆలయ ఈవో శ్రీనివాసరావు, దేవదాయశాఖ తనిఖీదారు ఆర్.బాలాజీ రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు.

నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయండి

ద్రాక్షారామ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షాభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్టుటైమ్ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు 4, 5 తేదీల్లో నిరసన తెలపాలని అంబేడ్కర్ కోనసీమ జిల్లా జేఏసీ చైర్మన్ సీహెచ్ వెంకన్నబాబు తెలిపారు. భోజన విరామంలో ఉద్యోగులు మండల, జిల్లా కేంద్రాల్లో నిరసన తెలపాలని ఆయన కోరారు.

నకిలీ దస్తావేజు కేసులో నిందితుడి అరెస్టు

రాజోలు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): నకిలీ దస్తావేసు కేసులో నిందితుడిని అరెస్టు చేశామని ఎస్‌ఐ బి.రాజేష్‌కుమార్ సోమవారం తెలిపారు. రాయవరం మండలం వెంటూరుకు చెందిన వి.రామసుబ్బారాయులు రామచంద్రపురం మండలం నర్సాపురపుపేటకు చెందిన పిల్లి సూర్యనారాయణ అలియాస్ సూరిబాబుతో చేతులు కలిపి రాజోలుకు చెందిన స్టాంపు వెండర్ సహకారంతో మరణించిన వ్యక్తి సంతకం ఫోర్జరీ చేసి దొంగ వీలునామా తయారు చేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న సూర్యనారాయణను అరెస్టు చేశామని ఎస్‌ఐ తెలిపారు. కాగా నిందితుడు పశుసంవర్ధకశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో అటెండర్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. నిందితుడిని రాజోలు కోర్టులో హాజరుపరచగా 14రోజులు రిమాండు విధించారని తెలిపారు.

నేటి నుంచి వీరబ్రహేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం

కపిలేశ్వరపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగరలో 6న జరిగే పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబ, సిద్దయ్యస్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మంగళవారం నుంచి విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం అవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం వీటి వివరాలను తెలిపారు. మంగళవారం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, ప్రధానదేవతా కలశస్థాపనలు, సర్వతోభద్ర మండల నవగ్రహ, వాస్తు, క్షేత్రపాలన, మోగినీ మండపారాధనలు, 5న అవాహిత దేవతామూర్తి హోమాలు, 6న పెద్దాపురానికి చెందిన తాళాభక్తులు వీరభద్రాచార్యులు శిష్యులు రామచంద్రపురం వాస్తవ్యులు, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ అర్చకులు అత్తిలి రామకృష్ణ శిష్య బృందంతో ఆయా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామివారు

ఘనంగా రథోత్సవం

మండపేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అర్తమూరు గ్రామంలో వున్న వేంకటేశ్వర స్వామివారి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నాల్గవరోజు సోమవారం స్వామివారి రథోత్సవం జరిగింది. ఆలయ ట్రస్టీ బుల్లి స్వామిరెడ్డి నేతృత్వంలో జరిగిన ఉత్సవంలో గోవిందమాలదారణ భక్తులతోపాటు పలు ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.